క్లుప్తంగా

సర్వసభ్య సమావేశం వాయిదా



సభ్యులు లేక వెలవెలబోయిన సమావేశం

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ జక్కుల అనిత తెలిపారు. సమావేశానికి సరిపడా సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేశామన్నారు. కాగా హుస్నాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు తరలివెళ్లడంతో సభకు గైర్హాజరయ్యారు.

బీఆర్ఎస్ సభకు తరలిన నాయకులు



ఎల్కతుర్తి: హుస్నాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండల అధ్యక్షులు మారుపాటి మహేందర్‌రెడ్డి, గొడిశాల సమ్మయ్యగౌడ్, ఎంపీపీ మేకల స్వప్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కడారి రాజు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, మహేందర్, తంగెడ మహేందర్, బూర్గుల రామారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

చర్య తీసుకోవాలి

పరకాల: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటరాజంపై చర్య తీసుకోవాలని ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ హేమంత్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హాస్టల్ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న టిఫిన్లు, మధ్యాహ్న భోజనం రుచికరంగా లేవని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోకిల ప్రేమ్, పట్టణ కార్యదర్శి కోకిల సాయితేజ్, ఆ సంఘం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల బాధ్యులు పాల్గొన్నారు.

విశ్రాంతిహాల్ నిర్మాణానికి భూమి పూజ



ఐనవోలు: శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో భక్తుల సౌకర్యార్థం విశ్రాంతిహాల్ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి దాత రామ ప్రకాశ్ హాజరై అర్చకులతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఈఓ మాట్లాడారు. రెండువేల మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా ఆలయ ప్రాంగణంలోని ఉత్తరం మొదటి గేటు వద్ద 90 ఫీట్ల పొడవు, వెడల్పుతో హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. వచ్చే జాతరలోగా విశ్రాంతిహాల్ భక్తులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన దాత రామప్రకాశ్ మాట్లాడుతూ.. తమ తాతాగారు రామరాయలింగం జ్ఞాపకార్థం మనుమలు సదానందం, ప్రకాశ్, ప్రభాకర్, రాజు, మహేష్‌లు ఈ విశ్రాంతిహాల్ నిర్మాణం చేపట్టాలని సంకల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ, ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ఎంపీపీ మార్నేని మధుమతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట : తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు టేకుల స్వామి తెలిపారు. మండల అధ్యక్షుడిగా లింగగిరి గ్రామానికి చెందిన కడగండ్ల యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా కోనాపురం గ్రామానికి చెందిన కొడగాని రాజీరును నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బీమా నగదు అందజేత

సంగెం : మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు ఏకశిల పురుషుల పొదుపు సంఘం పాలకవర్గం బీమా నగదు అందజేశారు. సంఘంలో సభ్యులైన చిలువేరు సత్యం, కడమంచి సారంగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అభయ నిధి, బీమా మొత్తం కలిపి సత్యం నామిని సదాలక్ష్మికి రూ.88,409, సారంగం నామిని స్వరూపకు రూ.71,402ల బీమా నగదు బుధవారం సంఘ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిర్ర మొగిళి, ఉపాధ్యక్షుడు కాగితాల జగన్నాధచారి, డైరెక్టర్లు బొజ్జ సురేష్, చింతాకుల సురేందర్, చిర్ర ప్రకాష్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

నిరుపేదల కోసమే 'గృహలక్ష్మి'

● భూమిపూజలు చేస్తున్న లబ్ధిదారులు



ఆత్మకూరు : గృహలక్ష్మి ఇంటి భూమి పూజలో పాల్గొన్న ఎంపీపీ సుమలత

దామెర: ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కళను సాకారం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టిందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో గృహలక్ష్మి లబ్ధిదారులు భూమిపూజ నిర్వహించగా ఆయన పాల్గొని టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలు గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, ఎంపీడీఓ కాసర్ల రవీందర్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ గుండా చంద్రమౌళి, పంచాయితీ కార్యదర్శి సరళ, కారోబార్ యజ్ఞం సురేష్, పున్నం నాగరాజు, పోటు సంపత్, మేకల సంపత్, గడ్డం శ్రీను, సల్ల అర్జున్ పాల్గొన్నారు. అదే విధంగా ఊరుగొండలో నిర్వహించిన గృహలక్ష్మి భూమిపూజల్లో వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: ముఖ్యమంత్రి కేసీఆర్ నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మార్క సుమలత అన్నారు. మండలంలోని కటాక్షపూర్‌లో బుధవారం గృహలక్ష్మి లబ్ధిదారులు భూమి పూజలు నిర్వహించగా ఆమె హాజరై టెంకాయ కొట్టి ప్రారంభించారు. నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని నిరుపేదలు గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకొని సొంతింటి కళను నెరవేర్చుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల లబ్ధిదారుల జాబితాను త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మచ్చిక యాదగిరిగౌడ్, వార్డు సభ్యులు కుడుతాల రమేష్, ఒన్నాల భిక్షపతి, ఐరబోయిన లక్ష్మిరాజన్న, మారపెల్లి సూర్యకుమారిరవి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సిరంశెట్టి సుమన్, లింగదారి రమేష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



దామెర : భూమి పూజ చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

జాతీయ పార్టీల దిష్టిబొమ్మలు దహనం



జాతీయ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న డీఎస్పీ నాయకులు

పరకాల: రాష్ట్రంలో 7 శాతం జనాభా లేని అగ్రకులాలకే రాజకీయ పార్టీలు పదవులను పట్టం గడుతున్నాయని డీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూరేళ్ల రమేష్ ఆరోపించారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం బస్టాండ్ కూడలిలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థానాన్ని దళితులకు కేటాయించడంతో పాటు జాతీయ పార్టీల నాయకత్వాన్ని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. క్యాబినెట్‌లో 93 శాతం అణగారిన వర్గాలకు కేటాయించాలన్నారు. రాష్ట్రం, దేశంలో అగ్రకులాల పెత్తనం నడుస్తోందని ఆరోపించారు. దళితులకు అవకాశం కల్పించే వరకూ ఉద్యమిస్తామని అన్నారు. రాష్ట్ర నాయకులు పూలమాల రాజు, నియోజకవర్గ బాధ్యులు రాజేష్, యుగేందర్, రత్నాకర్, నాగరాజు, రవీందర్, హరీశ్, ప్రశాంత్, సలీంపాషా పాల్గొన్నారు.

పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి



ఉత్సవాలు నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



దామెర : నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

ఎల్కతుర్తి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో దొరల గడీలను, భూ స్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, నైజాం అరాచకాలను ఎదిరించి సాయుధ పోరాటానికి సీపీఐ పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. ఈ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రాణత్యాగం చేశారన్నారు. వారి ప్రాణత్యానికి 3 వేల గ్రామాలకు విముక్తి లభించిందని, పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన చరిత్ర సీపీఐకి దక్కిందని గుర్తు చేశారు. సెప్టెంబర్ 17 వ తేదీన విలీన దినోత్సవాన్ని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో నైజాం ఏలిన ప్రాంతాల్లో అధికారికంగా జరుపుకుంటుందని, తెలంగాణ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న నాయకుల స్మృతి కోసం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నెదునూరి జ్యోతి, జాతీయ కౌన్సిలర్ మోత లింగారెడ్డి, నాయకులు వెంకటరమణ, శనిగరం రాజ్‌కుమార్, మొండయ్య, విజయ్, కంచర్ల సదానందం, చంద్రమౌళి, శ్యాంసుందర్‌రెడ్డి, పెండ్యాల అయిలయ్య, కుమారస్వామి, మొగిళి పాల్గొన్నారు.

తెలంగాణ విలీన దినోత్సవాన్ని జరపాలి

దామెర: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీన తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కొట్టెపాక రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ హిందు, ముస్లింల మధ్య చిచ్చుపెట్టించేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐ పాత్ర వెలకట్టలేనిదని వెల్లడించారు. నైజాం నావాబు అరాచకాలకు, భూస్వామ్య వ్యవస్థల నుంచి తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి చేసింది సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంబి సాంబయ్య, బ్రందయ్య, ప్రమీలరాణి, కైక, జగన్, గుడికందుల శారద, రాజయ్య, మంజుల, సతీష్, గోవర్దన్, నర్సయ్య, సురేష్, రవి, రాజు, హరి, కుమారస్వామితో పాటు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు విద్యార్థి ఎంపిక



జాహ్నవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కమలాపూర్: మండలంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి టి. జాహ్నవి జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిది నుంచి పదోతరగతి విద్యార్థులకు 'మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ ఏ డైట్ ఫ్యాడ్' అనే అంశంపై మండల స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో జాహ్నవి అత్యంత ప్రతిభ కనబర్చి మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి ఈ నెల 14 వ తేదీన జరిగే జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు న్యాయ నిర్ణేతలు తెలిపారు. ఉప్పల్ జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం, సైన్స్ ఉపాధ్యాయుడు మల్లయ్య సమక్షంలో జరిగిన ఈ సైన్స్ సెమినార్‌లో ఎంపీపీఎస్ టాకీస్ ఏరియా హెచ్ఎం, పీడబ్ల్యూసీ పవన్‌కుమార్ పరిశీలకులు, నిర్వాహకులుగా వ్యవహరించగా.. ఉపాధ్యాయులు ఎం.శివప్రసాద్, పి.గోపాల్‌రెడ్డి, ఐతఆర్పీ రవి, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా విద్యార్థిని జాహ్నవిని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో పాటు తదితరులు అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

దామెర: మండలంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ కాగితాల శంకర్ కోరారు. మండల కేంద్రంతో పాటు కోగిల్వాయి, ల్యాదెళ్ల, పులుకుర్తి, ఊరుగొండ సబ్ హెల్త్ సెంటర్లలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. అందులో భాగంగా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దేశ వ్యాప్తంగా ఆరోగ్య సేవలు విస్తరించడమే లక్ష్యంగా ఆయుష్మాన్‌భవకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సై ముత్యం రాజేందర్, మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల, పల్లెదవాఖాన డాక్టర్లు సాయితీ, రాధా శాంతిప్రియ, రుహీన, సిబ్బంది అశోక్‌బాబు, శ్రీకాంత్, భాగ్యలక్ష్మీ, లీల, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలి



సంఘీభావం తెలుపుతున్న జేఏసీ చైర్మన్

ఎల్కతుర్తి: ప్రభుత్వం ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి మరింత బలోపేతం చేయాలని జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ అవరణలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి మూడోరోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలన్నారు. టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10లక్షలు, హెల్పర్లకు రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చే వరకూ ఉద్యమాన్ని ఆపేదిలేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం స్పందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

దేవయ్యకు నేషనల్ అవార్డు



ఆహ్వాన పత్రం అందుకుంటున్న దేవయ్య

ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన ఆకారపు దేవయ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు 2023కు ఎంపికైనట్లు జాతీయ అవార్డు సెలెక్షన్ కమిటీ చైర్మన్, జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయంలో బుధవారం దేవయ్యకు అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమి ప్రతీ సంవత్సరం ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందిస్తుందని తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 15వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఆలిండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డును అందచేయనున్నట్లు పేర్కొన్నారు. 27 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది డెలిగెట్స్ కాన్ఫరెన్స్‌కి హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ.. అవార్డు లభించడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. 27 రాష్ట్రాల నుంచి వెయ్యి మంది హాజరుకాగా తాను ఎంపిక అవడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అందరి సహకారంతో మరింత ముందుకు వెళ్తానని దేవయ్య పేర్కొన్నారు. అవార్డు పత్రాన్ని అందించిన వారిలో బీఎస్‌ఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యం, యం గౌతమ్, రాష్ట్ర కార్యదర్శి కనుకుంట్ల విజయ్‌కుమార్, బీఎస్పీ నాయకుడు జిలకర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామెర: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఖురేషికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ముస్త్యాలపల్లిలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేసి, ఆక్రమణకు గురి కాకుండా చూడాలని కోరారు. ఇళ్లు లేని నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు ఏర్పచుకుంటే అధికారులు తొలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ఆ స్థలాలను ఆక్రమించుకున్నా అధికారులు ఎందుకు స్పదించడం లేదని ప్రశ్నించారు. ముస్త్యాలపల్లి శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలోని 218, 219 సర్వే నంబర్ భూమిలో సర్వే నిర్వహించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు దొగ్గెల తిరుపతి, ప్రజా సంఘాల నాయకులు గోవిందుప్రతాప్, దామెర రమేష్, గణేష్, గట్టయ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'బీసీబంధు' మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన కులాలకు చెందిన, చేతి వృత్తులు చేసుకుంటూ జీవనం గడుపుతున్న ప్రతిఒక్కరికీ బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో సుమారు 582 మంది బీసీలు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 35 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారని అన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా బీసీ ఉప కులాలను పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో బీసీబంధు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ బీసీబంధు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి హైదర్, రాజ్‌కుమార్, పత్తి శ్రీను, వీరన్న, శ్రీనివాస్, రాజు, కట్టయ్య, సుధాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరం



ఖాతాదారులకు ఆటపాటలతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దామెర: ఆర్థిక లావాదేవీలపై ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని ఏపీజీవీబీ మండల శాఖ మేనేజర్ రాజేష్ సూచించారు. మండల కేంద్రంలో అంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, నాబార్డ్ వారి ఆధ్వర్యంలో ఖాతాదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్‌చేసి ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీ, ఆధార్, పాన్‌కార్డు వివరాలు అడిగితే నిరాకరించాలని సూచించారు. బ్యాంక్ అధికారులు ఎట్టిపరిస్థితుల్లో ఫోన్లు చేయరని, బ్యాంక్ ఖాతాకు సంబంధించిన సమస్య ఉంటే పోస్టాఫీస్ ద్వారా లేఖలు పంపిస్తారని అన్నారు. అపరిచిత వ్యక్తులు బ్యాంకర్ల పేరుతో ఫోన్లు చేస్తారని, ఖాతాదారులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. యువత గ్రామాల్లోని నిరుద్యోగులకు సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్న యువతి, యువకులు ఇంటర్‌నెట్‌ను అవసరం నిమిత్తమే వాడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, అటల్ పెన్షన్ జనరల్ ఇన్సురెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుణాలు తీసుకున్నవారు సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలని కోరారు. రైతు రుణాలు, డ్వాక్రా రుణాలు, ముద్ర రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాకారుల ఆటాపాటలు, ఇంద్రజాల ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్‌భాస్కర్, ఎఫ్ఎల్‌సీ ప్రేమ్‌కుమార్, బ్యాంకుమిత్ర ఆలేటి రాధికసునీల్, రాజమహేంద్రవరం కళాకారులు, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పుష్కలంగా పోషక పదార్థాలు



ఊరుగొండలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, అంగన్‌వాడీ సిబ్బంది

దామెర: చిరుధాన్యాల్లో పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. మండలంలోని ఊరుగొండలో పోషణ్‌మాసం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. పోషక పదార్థాలు కలిగిన ఆహారం తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు అధికపోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన రక్తహీనత బారిన పడకుండా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్‌హెల్త్ సెంటర్ డాక్టర్ సాహితి, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ విజిత, తల్లులు, పిల్లలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నూతన వస్త్రాలు అందజేత



నూతన వస్త్రాలు అందజేస్తున్న గండ్ర జ్యోతి

శాయంపేట : భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో గండ్ర దంపతులు నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టాపన దిగ్విజయంగా పూర్తి అయ్యిన విషయం తెలిసిందే. స్వామి వారి కటాక్షం నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుతూ బుధవారం మండలంలోని కొత్తగట్టుసింగారం, తహరాపూర్ గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి స్వామివారి విభూది, ధాన్యాన్ని, నూతన వస్త్రాలను ప్రతి కుటుంబానికి అందించారు. ఎంపీపీ తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, ఎంపీటీసీ స్వాతివిష్ణు, సర్పంచ్ సంతోష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, రాజేందర్, సదయ్య, అయిలయ్య, సంతోష్, శివ పాల్గొన్నారు.

గంజాయి నుంచి యువతను కాపాడాలి

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో గంజాయి, మద్యం రవాణా జోరుగా సాగుతుందని, అధికారులు వాటికి అడ్డుకట్ట వేయాలని సీపీఐ మండల నాయకుడు మారెపల్లి క్రాంతికుమార్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో మద్యంతో పాటు గంజాయి రవాణా చాపకింద నీరులా ప్రవహిస్తుందని తెలిపారు. యువత గంజాయి మత్తుకు బానిస కాకుండా ముందస్తు చర్య చేపట్టాలని కోరారు. చదువుకోవాల్సిన వయస్సు పిల్లలు మద్యం మత్తులో పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి రవాణా చేసే వారిపై నిఘా ఉంచి చర్య తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. తల్లిదండ్రులు సైతం పిల్లల నడవడికలను గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, ఇసాక్ అలీ, నసీం, సాంబయ్య, సమ్మయ్య, రాజు, అంకుషావలితో పాటు తదితరులు పాల్గొన్నారు.